

VEDIKA

వేదిక

# చైతన్య స్రవంతి

## (సంపాదకీయ వ్యాసాలు)

భమిడిపాటి గౌరీశంకర్

# కృతజ్ఞతలు

ఈ పుస్తకం ఇంత చక్కగా కావటానికి మిత్రులు చేసిన సహాయ సహకారాలు మరువలేనవి.

ఈ పుస్తకానికి మంచి మాటలు రాసిన నరసన్నపేట శాసనసభ్యులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ డిప్యూటి ఫ్లోర్ లీడర్ **శ్రీ ధర్మాన కృష్ణదాస్‌గారికి** నా హృదయ పూర్వక కృతజ్ఞతలు.

ఈ చిన్న పుస్తకమును 'పెద్దమనసు' తో 'అంకితం' కు అంగీకరించిన సీనియర్ పాత్రికేయులు జర్నలిస్టు సంఘం అధ్యక్షులు, కవి, రచయిత అయిన **శ్రీ నల్లి ధర్మారావుగారికి..**

అన్ని తానై వ్యవహరించి పుస్తకానికి ఈ రూపు తీసుకువచ్చిన 'సాక్షి' సీనియర్ జర్నలిస్ట్ **శ్రీ సదాశివుని కృష్ణగారికి,**

నా గురించి చక్కగా వ్రాసి యిచ్చిన 'వేదిక' సేవా సంస్థ అధ్యక్షులు, నా శ్రేయోభిలాషి, మిత్రులు, జీవిత భీమా సంస్థలో డి.ఓ. గా విధులు నిర్వహిస్తున్న **శ్రీ ఎమ్.కె.రామ్‌గారికి.**

ఇంగ్లీష్ చక్కని సందేశం వ్రాసి ఇచ్చిన వాత్సల్య ఆసుపత్రి వ్యవస్థాపకులు మిత్రులు డా॥ గొలివి మోహన్‌గారికి,

అందంగా ముద్రించి ఇచ్చిన మహోదయ గ్రాఫిక్స్ అధినేత **శ్రీ టి.వి.యస్. కిషోర్‌సాయిగారికి** వారి సిబ్బందికి యావన్మందికి..

ఆర్థికంగా.. హార్థికంగా సహకరించిన నా మిత్రులకు, నా సోదరులు **బి.ఏ. నరసింహులు, నాగేశ్వరరావు, జగన్నాథరావులకు**

ఎందరో మహానుభావులు అందరికి.. కృతజ్ఞతలు..

**– రచయిత**

# మీ శక్తి మీకు తెలియాలి...

ఒక యువకుడు... జీవితంలో అన్ని విధాల ఓడిపోయి... ఆత్మహత్య చేసుకొందామని నిర్ణయించుకొని... వివేకానందుడు... తమ ప్రాంతానికి వస్తున్నాడని తెలుసుకొని చివరిసారిగా... స్వామిని దర్శించుకొని, చనిపోదామని నిర్ణయించుకొని... స్వామి దగ్గరకు వెళ్ళాడు...

స్వామి చుట్టూ జనం... నిశ్శబ్దంగా... ప్రసంగం వింటున్నారు... స్వామి ఒక్క క్షణం చెప్పటం ఆపారు. ప్రశాంతంగా నవ్వారు. ఆ నవ్వు తల్లినవ్వులా ఉంది.... చల్లని వెన్నెలలా ఉంది. తెల్లని వెన్నలా ఉంది... యువకుడు ముగ్ధుడయ్యాడు.... స్వామి ప్రసంగం కొనసాగిస్తూ ఓ చిన్న కథను ప్రారంభించారు...

"అమెరికాలో ఒక యువకుడు వ్యాపారంలో నష్టపోయి అప్పుల పాలయ్యాడు. భవిష్యత్ ఎలా? కుటుంబ పోషణ ఎలా? చచ్చిపోతేనో... అని రకరకాలుగా ఆలోచిస్తున్నాడు... ఇంతలో ఒక వృద్ధుడు... అతని వద్దకు వచ్చి... ఏమిటి సంగతని అడిగాడు... యువకుడు తన విషయం చెప్పాడు... వృద్ధుడు... జేబులోనుంచి చెక్కుబుక్కును తీసి... అక్షరాల కోటి రూపాయులకు చెక్ వ్రాసి... యువకునికిస్తూ... సరిగ్గా సంవత్సరం తరువాత ఇక్కడే కలిసి... నా డబ్బులు నాకిచ్చేయాలి... అని చెప్పి సమాధానం కోసం ఆశించక గబగబా వెళ్లిపోయాడు... యువకుడు చెక్కు మీద సంతకం చూసాడు... దాని మీద జాన్ డి. రాక్ ఫిల్లర్ అని ఉంది.. ఆ కాలంలో... ప్రపంచ ధనవంతుల్లో... నెంబర్ వన్ ఫిల్లర్. యువకుడు... ఆ చెక్కును మార్చలేదు.... తనకు ఎదురుగా కనబడేటట్లు పెట్టుకున్నాడు.... మరింత ఎక్కువగా శ్రమించాడు... విజయం సాధించాడు... అప్పులు తీర్చేసాడు... సంవత్సరం గడిచిపోయింది... వృద్ధునికి డబ్బులు ఇవ్వవలసిన రోజు వచ్చింది. పార్కులోకి వెళ్ళాడు... వృద్ధుడు వచ్చాడు... అతని వెంటనే... ఒక తెల్లని వ్యాను వచ్చింది.... అదొక పిచ్చాసుపత్రి వ్యాను. ముసలివాడు... పిచ్చివాడు... అందరికి ఇలాగే... ఫిల్లర్ పేరు మీద చెక్కులిస్తుంటాడని వారు చెప్పారు...

యువకునికి జ్ఞానోదయం కలిగింది... ఉందో లేదో తెలియని డబ్బు కాదు తనను మార్చింది... కేవలం ఆత్మ విశ్వాసం మాత్రమే తనను మార్చిందని అర్ధం చేసుకొన్నాడు. స్వామి చెప్పటం ఆపారు... అందరూ ఇంటి మార్గం పట్టారు... యువకుడు కూడా 'ధృ...ఢ...ంగా' అడుగులు వేస్తూ... క్రొత్త జీవితం కోసం... 'బయలు... దే...రా...డు..'

ఇంతకన్నా... ఏం చెప్పగలం... జీవితపు ఔన్నత్యం గురించి...?

# విద్య

నేటి విద్య తనకు అనుగుణంగా ఎలా ఉపయోగపడుతుందో అలా మలచుకుంటున్నాది వర్తమాన సమాజం.  తాను నేర్చుకుంటున్న విద్యతో... తన స్వార్థం కోసం చెట్లు, గాలి, భూమి... ప్రకృతి సంపదలను... దేన్నీ మనిషి వదలి పెట్టడం లేదు.

సీతాకోక చిలుక, కాకి, మనిషి ఒకేసారి మరణించి బ్రహ్మవద్దకు చేరుకున్నాయి.  బ్రహ్మ సీతాకోక చిలుకను చూసి 'నీకు స్వర్గం కావాలా... నరకం కావాలా' అని అడిగాడు. అందుకు సీతాకోక చిలుక నేను పుష్పాలలోని మకరందంను స్వీకరిస్తాను కదా! కనుక నాకు స్వర్గలోకం కావాలంది. సరేనని కాకిని అడిగాడు... కాకి 'నేను విత్తనాలను ఒకచోట నుంచి మరో చోటికి చేరవేస్తూ... చెట్లు పెరగడానికి సహకరిస్తాను.. కనుక నాకు కూడా స్వర్గమే కావాలి' అంది. సరేనని, మనిషిని కూడా అదే ప్రశ్న వేసాడు. అందుకు మనిషి... 'నీవు కూర్చున్న కుర్చీ నాది... అది కావాలి'అనే సరికి బ్రహ్మ ఖంగు తిన్నాడు.

తనకు ఉపయోపడే వాటిని మాత్రమే ఉంచుకొని మిగిలిన వాటిని నాశనం చేయమని చెప్పే విద్యకూడా 'మనిషి అహంకారానికి' ఒక కారణంగా ఉంది.  ఇతరుల వలన మనకు ఎటువంటి ఆదాయం లభిస్తుంది అనే ఆలోచనలను నేర్పించే విద్య మంచి విద్య కాదు.

విద్య అంటే ఇతరులను కూడా మనలో ఒక్కరిగా చూడాలని నేర్పించేది. అటువంటి విద్య అందిన వారికి మాన బంధాలు అమృతంగా మారుతాయి.

***వర్తమానంలో ఇటువంటి విద్యను అందించే సంస్థలేవి?***

# అమ్మా... ఆలోచించవూ...!?

అమ్మ...

నీవు పుట్టిన దగ్గర నుంచే 'అమ్మ' ఉంది... అంతకు మునుపు అమ్మలేదు... బిడ్డ కన్నీరు.... తల్లికి రక్త కన్నీరు... బిడ్డ ఏడుపు... తల్లికి 'చవు పిలుపు'... ఎంత కష్టం. ఎంతటి ఆవేదన... అమ్మతనం... ఓ కమ్మదనం... అమ్మంటే... బిడ్డకు కలలు కనటం నేర్పిన వ్యక్తి. అమ్మంటే వందలాది గురువులతో సమానం... 'రామయ్యా... అలా నుంచోవయ్యా' అని కైకేయి అంటే రామయ్య 'రాయి'లా మారేవాడు... శిలలా మిగిలేవాడు. అంటాడు కంకంటి పాపరాజు ఇదీ కదా తల్లి బిడ్డల మధ్య అనుబంధం... (రాముని తల్లి 'కైక' కాదు కదా అని అడగవద్దు... రామాయణం అందరికి తెలుసు)

అమ్మంటే వేయి చేతుల తల్లి... అమ్మంటే ప్రతిఫలం ఆశించక ప్రేమను పంచే అద్భుత శక్తి. అమ్మంటే –అనురాగాల అంతర్జాతీయ బ్యాంకు... ఎంతగా ప్రేమను 'విత్‌డ్రా' చేసుకొంటే అంతగా పెరుగుతుంది... అద్భుతం కదా!"

కాని... వర్తమానంలో... అమ్మంటే...!?

అమ్మ తన గురించి ఆలోచించదు.. తన బిడ్డల గురించి ఆలోచిస్తుంది... అమాయికంగా నిద్రపోతున్న బిడ్డబుగ్గమీద 'చిరు' ముద్దు పెట్టుకోవటంలో ఓ అద్భుతమైన ఆనందం తల్లికి దొరుకుతుంది... వర్తమానంలో... కార్పోరేట్ సంస్కృతి 'అమ్మ'లోని 'కమ్మ'దనాన్ని దూరం చేస్తున్నాదేమోనని అనుమానం...

'అమ్మలు'కు ఒక ప్రశ్న... 'అమ్మలారా'... పిల్లలు క్రమక్రమంగా ఎందుకు దూరమవుతున్నారు.... పెద్దవుతున్న కొద్ది ఎక్కడకు వెళుతున్నారో వారెందుకు మీకు చెప్పరు? కారణాలు ఏమిటి... కుటుంబ అవసరాలు... వ్యక్తిగత ఇష్టాలు.. హోదాలు... ఇలా ఏమిటి 'దూరం'ను పెంచుతున్నాయి.

ప్రేమకు తాము దూరమవుతున్నమనుకొనే వారే ప్రేమను కోరుకుంటారు. అప్పుడే తల్లులు 'ప్రేమ'ను అందించగలగాలి. ఎందుకంటే పిల్లలు తల్లులతోపాటుగా పుట్టలేదు... వారికాలం... వీరికాలం వేరు కదా!

ఒక్కమాట...

తల్లి మాత్రమే... పిల్లల్ని తిరిగి ఇంటికి రమ్మంటుంది... అలా వచ్చిన పిల్లలను అక్కున చేర్చుకొనే గొప్పతనం తల్లికి మాత్రమే ఉంది... అలా ఉంటేనే అన్నీ గొప్పగా ఉంటాయి...

ప్లీజ్... 'అమ్మ'... వర్తమానంలో... తల్లీపిల్లల బాంధవ్యం గురించి

ఆలోచించవూ...!?

# ఉగాది

**చైత్రేమాసి జగద్బ్రహ్మాససర్జ ప్రథమేహని।**
**శుక్ల పక్షే సమగ్రంతు తదా సూర్యదమే సతి॥**

చైత్రమాసపు తొలిరోజున సృష్టి ప్రారంభమయ్యింది. కనుక ప్రతీ సంవత్సరం చైత్ర శుద్ధ పాడ్యమిని ఉగాది పండగగా తెలుగు వారంతా జరుపుకోవటం అనాదిగా వస్తున్న సంప్రదాయం.

బాగుంది... కాని... 'మనమందరం' 'మనవారందరం' కలసి ఆనందంగా పండగను జరుపుకొని ఎన్ని 'సంవత్సరాదులు' వెళ్ళాయో ఒక్కసారైనా ఆత్మ పరిశీలన చేసుకున్నామా? పండగంటే పదిమంది కలసి పచ్చని తోరణాలును కట్టి, 'పచ్చడి'ని పంచుకు తినమనే అర్థంలోని పరమార్థమును మరచి పోతున్నామోననే ఓ భావన ఉంది.

చైత్ర మాసం. వసంత ఋతువు ప్రారంభం... లేతమామిళ్ల పులుపు వాసన... కోయిలల 'కుహు కుహు' రావాలు... చిన్న పిల్లల కేరితంతలు... కలసి భోజనాలు చేయటాలు... కలసి కష్ట సుఖాలను కలబోసుకోవటాలు.. ఆలోచిస్తే నిజమైన పండగ మనమధ్యే ఉందనిపిస్తుంది. ఒంటరిగా... 'నా కుటుంబం' మాత్రమే అని ఎందుకాలోచించుకోవాలి? 'టైమేదండి.. అందరికీ బిజియే' అనే మాటనవద్దు... ఒకే ఊరిలో ఉన్న మన వారందరిని పిలుద్దాం... పిల్లా పాపలతో ఉగాది పచ్చడిలోని తీపి... వగరు... పులుపు... చేదులను కలసి పంచుకుందాం... కలసి బజారుకు వెళదాం... కలసి ఆనందాలను పంచుకుందాం... కలసి భోజనాలను చేద్దాం పులిహోరా... బొబ్బట్లు... పాయిసం... వీటిలో ఉగాది పచ్చడిని 'నంజుకుతినండి' స్వర్గం మీ నాలుకపైన ఆనక మీ గొంతులోనూ ఆ తరువాత మీ జీవితంలో 'మాత్రమే' ఉన్నట్టుగా కనబడుతుంది. ఓ జీవితానికి సరిపడే ఉత్సాహాన్నిచ్చే 'రిఛార్జ్' ఉగాది మీకిస్తుంది...

రండి... మనమంతా 'కలసి'... ఉగాదిని ఆహ్వానిద్దాం... ఆనందంగా జరుపుకుందాం... ఈ శ్రీ నందననామ సంవత్సరం అందరి జీవితాలల్లో వెలుగును... సిరి సంపదలను ప్రసాదించాలని 'వేదిక' మనసారా కోరుకుంటున్నది.

**అందరికీ... ఇవే... మా... తెలుగు సంవత్సరాది శుభాకాంక్షలు.**

# స్వాగతం... సుస్వాగతం...

కాలం అరచేతిలో ఇసుక కారాదు. అమృతపు గుళిక కావాలి. నిరంతర అన్వేషణలో మనిషి కాలాన్ని జయించాడు. జయిస్తాడు కూడా... ఎన్నెన్నో ప్రలోభాలు అతడిని పరాజితుడిని చేయాలని ప్రయత్నించి పరాజయం పొందాయి. 'జయం' మనిషి జయకేతనమయింది.

కాలగమనంలో 'క్రొత్త' అనేది లేదు. కేవలం 'మార్పు' మాత్రమే! 'గడిచిన కాలాన్ని గడవబోయే కాలానికి మధ్య వారధి కట్టే ప్రయత్నం చేసిన వ్యక్తులే విజేతలు' అనే బిల్‌గేట్స్ మాటలు అందరికీ ఆచరణీయాలు. ముఖ్యంగా యువత ఈ అంశాన్ని సీరియస్‌గా గమనించాలి. క్రొత్త సంవత్సరంలకి వచ్చాం. బాగుంది, అర్ధరాత్రి వరకు విందులు, వినోదాలతో 'క్రొత్త'ను ఆహ్వానిస్తాం... మరుసటి రోజు నుండి...!? మళ్ళా మామూలే! ఇది కాదు క్రొత్తను ఆహ్వానించే పద్ధతి.

గడచిన కాలంలో మనం చేసిన తప్పులు... అప'జయాలు'... వైఫల్యాలు... విపరీతాలు... వీటన్నింటిని గుర్తుకు తెచ్చుకొని... వాటిని హరించే పక్కా ప్రణాళికను ఏర్పరుచుకొని ముందుకు దూసుకుపోవాలి. పంచాంగాలు, కొత్త కేలండర్‌లను చూసి తమకంతా శుభాలేనని పొంగిపోవద్దు. అశుభాలను చూసి కృంగిపోనవసరం లేదు. 'పద్నాలుగు నూతన సంవత్సరాలను నేను క్రొత్తగా జరుపుకొనే అవకాశం ఇచ్చిన తల్లిదండ్రులకు శిరస్సువంచి నమస్కరిస్తాను' అంటాడు ఉత్తర రామాయణంలో శ్రీరాముడు. క్రొత్త అన్వేషణకు శ్రీకారం చుట్టి మన చుట్టూ ఉన్న సమాజానికి.. కనీసం 'మనవాళ్ళకి' 'క్రొత్త' దారులను చూపుదాం. చరిత్రకారులుగా మిగిలిపోదాం. చరిత్రహీనులను కాలపురుషుడు క్షమించడు. మనం ఆ జాబితాలో లేకుండా చూసుకోవటానికి ఈ క్రొత్త సంవత్సరంలో ఓ 'వేదిక'ను రూపొందిద్దాం... రండి... చేయి చేయి కలిపి క్రొత్తను సగర్వంగా ఆహ్వానిద్దాం.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Chaitanya+Sravanti**

* * *